

మండిన సూర్యుడు



కడప కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం సూర్యుడు తన ప్రతాపం చూపించాడు. భానుడి భగభగలతో జనాలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పలు మండలాల్లో 40 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. వడ గాలులు వీచాయి. అత్యధికంగా రాజుపాలెం, దువ్వూరు మండలాల్లో 41.3 డిగ్రీలు, ప్రొద్దుటూరు, పెద్దముడియం మండలాల్లో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. యర్రగుంట్ల, ఒంటిమిట్ట, వల్లూరు, మైదుకూరు, ఖాజీపేట, గోపవరం, చాపాడు మండలాల్లో 40 డిగ్రీల నుంచి 40.6 డిగ్రీల ఎండలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. మిగతా మండలాల్లో 39 నుంచి 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సోమవారం కూడా ఇదే విధంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలున్నట్లు ఏపీ విపత్తుల శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

నేడు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక రద్దు

కడప క్రైం/కలెక్టరేట్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా సోమవారం సెలవు కావడంతో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు చేస్తున్నట్లు ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున సుదూర ప్రాంతాల నుంచి వ్యయ ప్రయాసలతో వచ్చే అర్జీదారులు ఈ విషయం గుర్తించి ఎస్పీ కార్యాలయానికి రావద్దని తెలిపారు. అలాగే సోమవారం కలెక్టరేట్‌లో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమాలను తాత్కాలికంగా రద్దు చేశామని డీఆర్వో విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

టీఐఎస్‌లో ప్రొఫైల్ ధ్రువీకరణ తప్పనిసరి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జోన్-4 పరిధిలోని రాయలసీమ జిల్లాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తప్పనిసరిగా టీచర్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం (టీఐఎస్)లోని తమ ప్రొఫైల్‌లో లాగిన్ అయి వ్యక్తిగత వివరాలను ఓటీపీ ద్వారా తప్పనిసరిగా ధ్రువీకరించాలని ఆర్జేడీ కె.శామ్యుల్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఐఎస్‌లో చూపిన సీనియారిటీ జాబితాను ప్రతి ఉపాధ్యాయుడు పరిశీలించాలని పేర్కొన్నారు. ఇందులో ఏమైనా పొరపాట్లు ఉన్నట్లయితే, నిర్దేశిత గడువులోపు సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు. తర్వాత వచ్చిన అభ్యంతరాలు పరిగణనలోకి తీసుకోమని తెలిపారు.

అంబేడ్కర్ భవన్‌కు మోక్షమెన్నడు..?



ప్రొద్దుటూరులో అంబేడ్కర్ భవన్‌కోసం ఎంపిక చేసిన స్థలం ఆక్రమణలకు గురవుతున్న దృశ్యం

- ఏడేళ్లు గడిచినా ముందుకు సాగని ఫైలు
- దళితులకు హామీలు తప్ప అమలు లేదా
- అన్యాక్రాంతమవుతున్న అంబేడ్కర్ భవన్ స్థలం
- పట్టించుకోని మున్సిపల్ పాలకమండలి, అధికారులు



ప్రొద్దుటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ఎప్పుడు మోక్షం లభిస్తుందా? అని దళిత బహుజన వర్గాల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎన్నికల ముందు దళిత బహుజన వర్గాల ఓట్ల కోసం నాయకులందరూ అంబేడ్కర్ భవన్ నిర్మిస్తామని ఇచ్చిన హామీలు ఏడేళ్లయినా అమలుకు నోచుకోలేదు. 2018 జనవరి 31 ఎస్సీ ఎస్టీ బీసీ సంఘాల ప్రతినిధులు ప్రొద్దుటూరు పట్టణం థర్డ్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఓపెన్ సైట్‌లో అంబేడ్కర్ భవనం ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని అప్పటి మున్సిపల్ పాలకమండలి టీడీపీ చైర్మన్ ఆసం రఘురామిరెడ్డికి విన్నవించగా ఆయన అంగీకరించారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో పెట్టి 32 సెంట్ల మేర స్థలం కేటాయించి భవన నిర్మాణం చేపట్టేందుకు ఆమోదం తెలిపారు. ఆమేరకు భవనం డిజైన్ తయారీని ప్రైవేటు కన్సల్టెన్సీకి అప్పగించాలని అధికారులకు సూచించారు. అనంతరం 2019లో జరిగిన ఎన్నికల సమయంలోనూ ప్రధాన పార్టీలు ప్రొద్దుటూరులో అంబేడ్కర్ భవన్ నిర్మిస్తామని ప్రకటించాయి.

ఐదేళ్లు వైసీపీ అధికారంలో ఉంది. టీడీపీ అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది కావస్తోంది. నేటికీ ప్రొద్దుటూరులో అంబేడ్కర్ భవన్ కలగానే ఉంది.

డీటీసీపీకి పంపిన ప్రతిపాదనలు

అంబేడ్కర్ భవన నిర్మాణానికి మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన తర్వాత టౌన్‌ప్లానింగ్ అధికారులు డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీప్లానర్స్ (డీటీసీపీ)కు డిజైన్స్ అనుమతి కోసం నివేదిక పంపినట్లు తెలిపారు. అయితే టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ కార్యాలయంలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి అనుమతులు నిరాకరించినట్లు సమాచారం. ఆ తరువాత మున్సిపల్ పాలక మండలిగానీ అధికారులు గానీ అనుమతుల కోసం ప్రయత్నం చేయలేదని ఎస్సీ, బీసీ సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. ఒకవేళ మున్సిపల్ ఓపెన్ సైట్‌లలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వడానికి కుదరకపోతే అదే లేఅవుట్‌లో ఇండోర్‌స్టేడియం నిర్మాణానికి ఎలా అనుమతులు ఇచ్చారని దళిత, బీసీ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. స్టేడియంకు అనుమతుల ఇస్తే అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి ఎందుకు అనుమతులు తీసుకురాలేకపోయారని మున్సిపల్ పాలకమండలిని, అధికారులను ప్రశ్నిస్తున్నారు.


ఆక్రమణల్లో మున్సిపల్ ఓపెన్ స్థలం

అంబేడ్కర్ భవన్ కోసం కేటాయించిన 32 సెంట్ల స్థలంలో ఇప్పటికే 15 సెంట్ల మేర ఆక్రమించి క్రయ విక్రయాలు జరిపినట్లు సమాచారం. గతంలో ఒక కౌన్సిలర్ బంధువు ఈ స్థలాన్ని ఆక్రమించి విక్రయించినట్లు ఆ ప్రాంత వాసులే వెల్లడిస్తున్నారు. దీనిపై కోర్టులో కేసులు కూడా నడుస్తున్నట్లు సమాచారం. మరికొందరు అక్రమంగా కట్టడాలు సైతం నిర్మించారు. మున్సిపాలిటీ అధికారులు ఆ స్థలానికి నేటికీ రక్షణ గోడ కట్టి ఆక్రమణలకు గురికాకుండా కాపాడ పోవడంపై విమర్శలు ఎదురవుతున్నాయి.

ఆ ఫైలును కదిలిస్తాం

అంబేడ్కర్ భవన్ కోసం థర్డ్ కాలనీలో కేటాయించాలనుకున్న స్థలం ఫైలును కదిలిస్తాం. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి, ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లి గతంలో ఈ స్థలం కేటాయింపునకు ఎదురైన ఆటంకాలేవో పరిశీలిస్తాం. రిమార్కులు ఏవైనా ఉంటే వాటిని పూర్తిచేసి ప్రభుత్వ అనుమతి కోసం పంపేందుకు ప్రయత్నిస్తాం. అంబేడ్కర్ భవన నిర్మాణం కోసం కృషి చేస్తాం.

– వి.మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, ప్రొద్దుటూరు



నాయకులు హామీ నిలబెట్టుకోవాలి

ఎన్నికల ముందు అంబేడ్కర్ భవన్ నిర్మిస్తామని టీడీపీ, వైసీపీ నాయకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి అంబేడ్కర్ భవన్ కోసం థర్డ్ కాలనీలోని మున్సిపల్ ఓపెన్ స్థలం కేటాయించేలా ప్రభుత్వాన్ని ఒప్పించాలి. భవన నిర్మాణం కోసం నిధులు విడుదల చేయించాలి. వైసీపీ మున్సిపల్ పాలకమండలి వెంటనే ఈ స్థలం అంబేడ్కర్ భవన్‌కు కేటాయించేలా మున్సిపల్ అధికారులను ఆదేశించి త్వరితగతిన అనుమతులు వచ్చేలా కృషిచేయాలి.

– ఎల్లయ్యమాదిగ, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొద్దుటూరు



డీఎస్పీతో మాట్లాడుతున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

కాళీయమర్దనుడిగా కోదండరాముడు



అశ్వవాహనంపై ఊరేగుతున్న కోదండరాముడు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఒంటిమిట్ట కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అయిన ఆదివారం ఉదయం కోదండరాముడు కాళీయమర్దనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తజన బృందాలు భజనలు, కోలాటాలు ఆడుతుండగా శ్రీరామచంద్రుడు కాళీయమర్దనుడి రూపంలో గ్రామ వీధుల్లో విహరించారు. ఉదయం వాహనసేవ అనంతరం 11 గంటలకు స్నపనతిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె చందనంతో సీతారామ లక్ష్మణులకు విశేషంగా అభిషేకం నిర్వహించారు. రాత్రి కోదండరాముడు అశ్వవాహనంపై భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, భక్తులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

కోదండరామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి 10.30 గంటల వరకు చక్రస్నానం నిర్వహిస్తారు. రాత్రి ఏడు గంటలకు ధ్వజావరోహణతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. అలాగే మంగళవారం సాయంత్రం 6గంటల నుంచి 9గంటల వరకు కోదండరామ స్వామి ఆలయంలో పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.



కాళీయమర్దన అలంకారంలో...

లారీ డ్రైవర్లను చితకబాదారు

- నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- లారీ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పులివెందుల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో గేటు వసూలు చేసే వారు లారీ డ్రైవర్లను చితకబాదారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశాఖపట్టణం, విజయవాడ, తెనాలి, ప్రకాశం, అన్నమయ్య తదితర జిల్లాల లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం 'చలో పులివెందుల' పేరుతో రాష్ట్రంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్, లారీ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వీరంతా పులివెందులకు తరలివచ్చారు. మూడు రోజుల క్రితం మదనపల్లెకు చెందిన లారీ డ్రైవర్లను పులివెందుల మున్సిపాలిటీలో గేటు వసూలు విషయమై సంబంధిత వ్యక్తులు దాడి చేశారు. దాడికి పాల్పడ్డవారిపై చర్యలు తీసుకోకపోవడంతో వీరు పులివెందులకు వచ్చారు. ఈ సందర్భంగా పులివెందుల డీఎస్పీ మురళీనాయక్, సీఐలు రమణ, చాంద్‌బాషాలతో లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పీజేఆర్ఎస్ మహారథి, టీవీ చలపతిరావు, వైవీ ఈశ్వరరావు మాట్లాడారు. లారీ డ్రైవర్లపై దాడి చేయడం మంచిదికాదని, ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆర్డర్ల ప్రకారం లారీ డ్రైవర్ల వద్ద నుంచి ఎటువంటి గేటు వసూలు చేయరాదన్నారు. పులివెందులలో మాత్రం ఇష్టమొచ్చినట్లు లారీ డ్రైవర్ల నుంచి గేటు వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ గేటు ఇక్కడ వసూలు చేస్తున్నారన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ.. దాడి విషయం లా అండ్ ఆర్డర్ పరిధిలోకి వచ్చిందన్నారు. గేటు విషయం మున్సిపల్ శాఖకు సంబంధించిన విషయమన్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు సమాచారం ఇచ్చారు. మున్సిపల్ ఆర్వో సమావేశానికి హాజరయ్యారు. గేటు వసూలు చేసే వారికి ఎలాంటి రశీదులు ఇవ్వలేదని మున్సిపల్ ఆర్వో తెలిపారు. దీనిపై పూర్తిస్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ అన్నారు.

కర్రలతో కొట్టారు

పులివెందులలో గేటు వసూలు విషయమై లారీ డ్రైవర్లను కర్రలతో చితకబాదారని లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి పీజేఆర్ఎస్ మహారథి అన్నారు. డీఎస్పీని కలిసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ అమ్మకం, కొనుగోలు వ్యక్తులను వదిలేసి లారీ డ్రైవర్ల వద్ద నుంచి గేటు వసూలు చేయడం ఏమిటన్నారు. పులివెందులలో గేటు వసూలు మరీ దారుణంగా ఉందన్నారు. పులివెందుల మీదుగా వేరొక ప్రాంతానికి వెళ్తున్న సమయంలో అడ్రస్ అడిగేందుకు వాహనాన్ని ఆపితే గేటు వసూలు చేస్తున్నారన్నారు. చట్టాలు చెబుతున్నట్లు రూ.55 కాకుండా రూ.400 వసూలు చేస్తున్నారన్నారు. పులివెందులలో మొన్న జరిగిన దాడి విషయమై వీడియోలను డీఎస్పీ మురళీనాయక్, సీఐలకు అందించామన్నారు. పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలని కోరామన్నారు.

ఇసుక బస్తాలతో.. ఎన్నేళ్లు..?




దెబ్బతిన్న రివిట్‌మెంట్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటుచేసిన ఇసుకబస్తాలు

- ఒకపక్క కుంగిన రివిట్‌మెంట్.. మరోపక్క రాతిగోడ నుంచి లీకేజీలు
- 10 టీఎంసీలకు గాను.. 6.5 టీఎంసీలకే పరిమితం
- గండికోటలో నీరున్నా.. సీబీఆర్‌లో నింపలేని దుస్థితి

పులివెందుల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్)కు ఏళ్ల గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. కట్ట రివిట్‌మెంట్ పనుల్లో నాణ్యత లోపించడంతో 2021లో పలుచోట్ల కుంగింది. దీనికి తాత్కాలికంగా ఇసుకబస్తాలతో సరిపెట్టారు. అలాగే రాతికట్ట నుంచి చిన్నపాటి లీకేజీలు ఉన్నాయి. వీటికి గత ప్రభుత్వంలో మరమ్మతులు చేయలేదు. దీంతో గండికోటలో నీరు ఉన్నా సీబీఆర్‌లో పూర్తిస్థాయిలో 10టీఎంసీల నీటిని నింపలేని దుస్థితి ఏర్పడింది.

కడప జిల్లాలో పులివెందుల ప్రాంతానికి అటు అనంతపురం, సత్యసాయి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలకు సీబీఆర్ సాగు, తాగునీటికి ఆదరువుగా మారింది. 1985లో అప్పటి ప్రభుత్వం చిత్రావతి నదిపైన చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించేందుకు అనుమతులు ఇచ్చింది. దీనిని ముందుగా 5 టీఎంసీల సామర్థ్యంతో ప్రభుత్వం మంజూరు చేసింది. ప్రాజెక్టు నిర్మాణ సమయంలోనే 5 టీఎంసీల ప్రాజెక్టును 10 టీఎంసీలకు పెంచుతూ నిధులు కేటాయించింది. ఈ మేరకు 1985లో ప్రారంభమైన సీబీఆర్ ప్రాజెక్టు నిర్మాణ పనులు 2009 నాటికి పూర్తిచేసుకుంది. 2009 నాటికి సీబీఆర్ పనులు పూర్తయినా పూర్తిస్థాయి నీరు వచ్చే అవకాశం ఉండేది కాదు. దీంతో వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో గండికోట నుంచి సీబీఆర్‌కు నాలుగు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని మళ్లించే కార్యక్రమం చేపట్టారు. ఇందులో ముఖ్యమైనది గండికోట ఎత్తిపోతల పథకం. ఈ పనులను చంద్రబాబు నాయుడు పూర్తిచేసి 2017లో గండికోట ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. ఆ ఏడాది మొట్టమొదటి సారి గండికోట ద్వారా కృష్ణాజలాలు సీబీఆర్‌కు చేరాయి. ఆ ఏడాది నుంచి క్రమంగా కృష్ణాజలాలను సీబీఆర్‌లో నింపుతూ వస్తున్నారు. 2021లో జగన్ ముఖ్యమంత్రి అయ్యాక మొట్టమొదటి సారి సీబీఆర్‌ను 10 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో నింపారు.



నీటితో కళకళలాడుతున్న సీబీఆర్

పోటెత్తిన వరదతో కుంగిన రివిట్‌మెంట్

2022లో సీబీఆర్‌కు వరద పోటెత్తింది. ఆ సమయంలో సీబీఆర్ మట్టికట్టకు రక్షణగా నిర్మించిన రాతికట్ట రివిట్‌మెంట్ కుంగింది. దాదాపు 300మీటర్ల దూరం పలుచోట్ల కట్ట కుంగింది. రివిట్‌మెంట్ కుంగిన చోట కట్ట దెబ్బతినకుండా ఇసుక బస్తాలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కుంగిన రివిట్‌మెంట్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. వైసీపీ ప్రభుత్వం ఈ పనుల కోసం రూ.14.38కోట్లు నిధులు మంజూరు చేసింది. కానీ పనులు మాత్రం చేపట్టలేదు. కట్ట రివిట్‌మెంట్ దెబ్బతినడంతో 6.5 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ చేస్తున్నారు.

రాతికట్ట నుంచి లీకవుతున్న నీరు

సీబీఆర్ నిర్మాణ సమయంలో ఆనకట్ట కొంతమేర పూర్తిగా రాతితో నిర్మించారు. ఈ రాతికట్ట నిర్మించిన దాదాపు 10సంవత్సరాలకు నీటిని నిల్వ చేశారు. దీనితో పలుచోట్ల రాతికట్ట నుంచి నీరు లీకవుతోంది. రివిట్‌మెంట్ కుంగడం, రాతి కట్ట నుంచి నీరు లీకవుతున్న విషయాలపై ఆంధ్రజ్యోతి ఓ అధికారిని వివరణ కోరగా.. ఆయన స్పందిస్తూ 2022లో వచ్చిన వరదల అనంతరం రివిట్‌మెంట్ కుంగిన మాట వాస్తవమేనన్నారు. ఈ మరమ్మతులకు నిధులు మంజూరైనా ప్రాజెక్టులో నీరు ఉండడంతో పనులు చేసేందుకు వీలుకాలేదన్నారు. అలాగే రాతి కట్ట నుంచి లీకేజీలు ఉన్నా దానివల్ల ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ప్రాజెక్టులో నీరు ఉన్నన్నాళ్లు రివిట్‌మెంట్ మరమ్మతులు వీలుపడదన్నారు. రివిట్‌మెంట్ కుంగిన లెవెల్ వరకు 6.5టీఎంసీల నీరు నిల్వ చేసుకోవచ్చు అన్నారు.

యువకుడి హత్య

- వల్లూరు మండలానికి చెందిన యువకుడిని.. వేంపల్లెలో కొట్టి నిప్పు పెట్టారు



కుమారుడి మృతితో రోదిస్తున్న తల్లి, బంధువులు



హత్యకు గురైన పంగా రామయ్య

వేంపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె మండలం నందిపల్లె సమీపంలోని అరటితోటల వద్ద వల్లూరు మండలం సీతోరిపల్లెకు చెందిన యువకుడిని కొట్టి నిప్పుపెట్టి పడవేశారు. స్థానిక రైతులు గుర్తించి పోలీసులకు, 108కు సమాచారం ఇవ్వగా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ తెలిపిన వివరాల మేరకు..

వల్లూరు మండలం సీతోరిపల్లె గ్రామానికి చెందిన వీరయ్య కుమారుడు పంగా రామయ్య (20) ఐటీఐ చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. శనివారం మధ్యాహ్నం వీరపునాయునిపల్లెలోని సోదరి ఇంటికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. రాత్రి అయినా సోదరి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. స్నేహితులతో కలిసి ఎక్కడికో వెళ్లి ఉంటాడు, వస్తాడులే అనుకున్నారు. ఆదివారం ఉదయం 8గంటల ప్రాంతంలో తలకు ఇతర చోట్ల గాయాలై నిప్పంటుకొని చావుబతుకుల మధ్య వేంపల్లె మండలం నందిపల్లె సమీపంలోని అరటితోట వద్ద కొట్టుమిట్టాడుతుండగా స్థానిక రైతులు గుర్తించి 108కి, వేంపల్లె పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు చేరుకున్న 108 వాహనంలో రామయ్యను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని పులివెందుల డీఎస్పీ మురళినాయక్, వేంపల్లె, పులివెందుల సీఐలు నరసింహులు, చాంద్‌బాష, రమణ పరిశీలించారు. తల్లిదండ్రులు, బంధువులను విచారించారు. ఘటన స్థలాన్ని బట్టి ఎవరో హత్య చేసి ఉంటారని ప్రాథమికంగా నిర్ధారణ అయిందని, రెండుమూడు రోజుల్లోనే నిందితులను పట్టుకుంటామని డీఎస్పీ తెలిపారు. కాగా రామయ్య తల్లిదండ్రులు కుమారుడి హత్యపై వేంపల్లె, పులివెందులలో ఉన్న స్నేహితులపై అనుమానం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

ప్రాణం తీసిన ఈత సరదా..

● చెరువులో మునిగి విద్యార్థి మృతి



ఈతకు వెళ్లి మృతిచెందిన భాస్కర

పెద్దమండ్యం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): స్నేహితుడి స్వగ్రామంలో జాతర చూసేందుకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రాణాలను ఈత సరదా బలి తీసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పెద్దమండ్యం మండలం కలిచెర్లకు చెందిన కేశవరెడ్డి కుమారుడు అరవింద్ కుమార్‌రెడ్డి, తంబళ్లపల్లి మండలం కోసువారిపల్లికి చెందిన రాజశేఖర్‌రెడ్డి, పీటీఎం మండలం బోర్లపల్లి గ్రామ పంచాయతీ పిడుమువారిపల్లికి చెందిన రెడ్డప్ప కుమారుడు భాస్కర ఇటీవలే పదో తరగతి పరీక్షలు రాశారు. పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ కోసం మదనపల్లిలోని ఓ కోచింగ్ సెంటర్‌లో చేరారు. వీరి మధ్య స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం అరవింద్‌తో కలసి ఇద్దరూ కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్లకు వచ్చారు. ఆదివారం గ్రామ సమీపంలోని పాపిరెడ్డిచెరువులోకి ఈతకు వెళ్లారు. ఈత కొడుతూ భాస్కర చెరువు నీటిలో మునిగిపోయాడు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు చెరువు వద్దకు వెళ్లి అతనిని వెలికి తీసే సరికే మృతి చెందాడు. ఈ సంఘటనతో గ్రామంలో విషాదం అలుముకుంది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు గోడుగోడున విలపించారు. సంఘటన స్థలాన్ని పెద్దమండ్యం పోలీసులు పరిశీ లించారు.. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దమండ్యం ఎస్ఐ పీవీ రమణ తెలిపారు. మృతదేహాన్ని మదనపల్లి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు వివరించారు.

రెండు స్కూటర్లు ఢీ.. మహిళ మృతి

● తండ్రీ కుమారుడికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గులాబ్‌జాన్

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి లోని రామాపురం మండలం బండపల్లి గ్రామం వీఆర్ పాఠశాల సమీపంలో ఆదివారం తెల్లవారుజామున రెండు స్కూటర్లు ఢీకొని షేక్ గులాబ్జాన్ (45) అనే మహిళ మృతి చెందగా తండ్రీకొడుకు గౌస్‌మోద్దీన్, మహమ్మద్ అనాస్‌లకు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. రామాపురం మండలం వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన షేక్ గౌస్‌మోద్దీన్, ఆయన భార్య షేక్ గులాబ్జాన్, కుమారుడు మహమ్మద్‌అనాస్ రాయచోటికి వెళ్లి తిరిగి ఏపీ04 ఏబీ 3151 నెంబరు గల ఎక్స్‌ఎల్ స్కూటర్‌లో ఇంటికి వస్తున్నారు. వీఆర్ స్కూల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు రాగానే రాయచోటి నుంచి కడపకు వెళ్తున్న మోటారు సైకిల్ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీ40 ఎఫ్‌సీ7187 నడుపుతున్న వ్యక్తి అతివేగంగా వచ్చి ముందు వెళ్తున్న స్కూటర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా షేక్ గులాబ్‌జాన్ పరిస్థితి విషమించడంతో కడప రిమ్స్‌కు తరలించగా మార్గమధ్యంలో ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు..

● భర్త, కుమార్తెకు గాయాలు ● కూతురి పరిస్థితి విషమం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయురాలు మృతిచెందగా, ఆమె భర్త, కూతురు తీవ్రంగా గాయపడ్డారు. అన్నమయ్య జిల్లా, కలకడ మండలానికి చెందిన శారద (40) కదిరిలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుండగా, ఆమె భర్త వెంకటరమణ ములకచెరువు మండలం, సోంపాలెంలో ఉపాధ్యాయుడుగా పని చేస్తున్నాడు. వీరి కుమార్తె కీర్తి విజయవాడలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్ ఫలితాల విడుదల సందర్భంగా శనివారం విజయవాడకు వెళ్లిన వారు, అక్కడి నుంచి కారులో తిరువణ్ణామలైకి వెళ్లారు. అక్కడి నుంచి కదిరికి వెళుతుండగా, ఆదివారం ఉదయం పుంగనూరు మండలం, సుగాలిమిట్ట వద్ద వీరు ప్రయాణిస్తున్న కారును ఐషర్ వాహనం ఢీకొంది. దీంతో ముగ్గురూ తీవ్రంగా గాయపడగా, స్థానికులు వారిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శారద మృతిచెందగా, వెంకటరమణ, కీర్తిని బెంగుళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. కీర్తి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు పుంగనూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు దుకాణంలో చోరీ

● 4 కేజీల వెండి ● 20 గ్రాములు బంగారు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఖాజీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఖాజీపేట నడిబొడ్డున ఉన్న వీఎస్ జ్యువెలరీ షాపులో ఆదివారం తెల్లవారుజామున దుకాణానికి ఉన్న తాళం పగులకొట్టి లోనికి ప్రవేశించి అందులో ఉన్న నాలుగు కేజీల వెండి, 20 గ్రాముల బంగారం తీసుకెళ్లారని పోలీ సులు తెలిపారు. వారు సీసీ కెమెరాలను గుర్తించకుండా చోరీకి పాల్పడడంతో రికార్డు అయింది. ఇందులో ముగ్గురు వ్యక్తులు ఈ చోరీకి పాల్పడినట్లు బయటపడింది. విషయం తెలుసుకున్న సీఐ మోహన్ సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీంను తెప్పించి పరిశీలించారు. దుకాణ యజమాని షేక్ వహీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘాట్ రోడ్డులో లారీ టైర్లు దగ్ధం




కాలిపోతున్న కోళ్ల దాణా లారీ

రామాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్ రెండో మలుపు వద్ద ఆదివారం కోళ్ల దాణా తీసుకువెళ్తున్న లారీ టైర్లు దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. కడప నుంచి కోళ్ల దాణా చిత్తూరుకు తీసుకువెళ్తున్న ఏపీ39 ఉక్ 8371 గల లారీ గువ్వలచెరువు రెండో ఘాటు వద్ద రాగానే టైర్లకు మంటలు అంటుకున్నాయి. గమనించిన లారీ డ్రైవర్ లారీని ఆపి కిందకు దిగాడు. స్థానికుల సహాయంతో లక్కిరెడ్డిపల్లె అగ్నిమాపక కేంద్రానికి ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించి అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో.. రూ.25 కోట్లు కొల్లగొట్టారు..!







● నయామోసాలకు పాల్పడుతున్న సైబర్ నేరగాళ్లు
● మోసపోయిన వారిలో ఎక్కువగా ఉద్యోగులు, విద్యావంతులు
● 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు

వెయ్యికి 2వేలు, 2వేలకు 4వేలు అంటూ సోషల్ మీడియా గ్రూపుల్లో వచ్చే ప్రకటనలకు కొంతమంది ఆశపడి డబ్బులు పెడతారు. ఆశ కాస్త అత్యాశగా మారడంతో లక్షలు, కోట్ల రూపాయలు పెట్టుబడులు పెట్టి సైబర్ నేరగాళ్లకు చిక్కి మోసపోతున్నారు. ఇటీవల ఆన్‌లైన్ పెట్టుబడి మోసాల కేసులు పెరుగుతున్నాయి. ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంటు పేరుతో సైబర్ మోసగాళ్లు సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ డబ్బులు ఈజీగా కొట్టేస్తున్నారు. జిల్లాలో 13 నెలల్లో 1,201 ఫిర్యాదులు రాగా, రూ.25కోట్లకు పైగానే బాధితులు పోగొట్టుకున్నారు.

కడపక్రైం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఇప్పుడు ఆండ్రాయిడ్ మొబైల్ వినియోగిస్తున్నారు. ఇప్పుడున్న టెక్నాలజీతో ఏదో ఒక ఆశ చూపించి కష్టపడకుండానే సైబర్ నేరగాళ్లు డబ్బులు లాగేస్తున్నారు. ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో కోట్లు కొల్లగొట్టారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి డబ్బు ఇన్వెస్ట్ చేసిన వారిలో డాక్టర్లు, ఇంజనీర్లతో పాటు బీటెక్ విద్యార్థులు ఉండటం విశేషం. వీరికి ఇన్వెస్ట్‌మెంట్‌లపై అవగాహన ఉన్నప్పటికీ రూ.కోట్లు సంపాదించాలనే ఆశతో పెట్టుబడులు పెడుతున్నారు. అధిక లాభాలు వస్తాయంటూ షేర్ మార్కెట్లపై కొన్ని వాట్సప్ గ్రూపుల్లో పేర్లతో సహా ప్రతిరోజూ ప్రకటనలు వస్తున్నాయి. ఈ ప్రకటనలు చూసి అత్యాశతో ఎవరైనా స్పందిస్తే మాత్రం వారి ఖాతా ఖాళీ కావాల్సిందే. ఒక్కసారి వారి ఉచ్చులో పడితే భయపెట్టడంతో పాటు సైబర్ నేరగాళ్లు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు.

జిల్లాలో కొందరు బాధితులు

● కడపకు చెందిన ఓ డాక్టరు ట్రేడింగ్, స్టాక్‌మార్కెట్‌లో రూ.3కోట్లకు పైగా పెట్టుబడి పెట్టాడు. ఆయనకు ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మోసపోయానని గుర్తించి లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించాడు.

● మైదుకూరు వాసి అయిన కానిస్టేబుల్ ప్రస్తుతం వేరే జిల్లాలో పనిచేస్తున్నాడు. స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయంటూ అతనితో పాటు స్నేహితులు, తోటి ఉద్యోగులతో దాదాపు రూ.3కోట్లకు పైగానే పెట్టుబడులు పెట్టించాడు. వీళ్ల డబ్బులు పెట్టడమే కానీ తిరిగి రాలేదు. దీంతో బాధితులంతా ఆ కానిస్టేబుల్‌పై వత్తిడి తెస్తున్నారు. ఆయన స్పందించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● కమలాపురానికి చెందిన ఓ వ్యక్తి చుట్టుపక్కల గ్రామాలకు చెందినవారికి స్టాక్‌మార్కెట్‌పై అవగాహన కల్పించి వారితో లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టించాడు. తాము కట్టిన డబ్బులు తిరిగి ఇవ్వాలని ఇటీవల వారు కోరినప్పటికీ అతను సరిగా స్పందించకపోవడంతో బాధితులందరూ పోలీసులను ఆశ్రయించారు.

● స్టాక్‌మార్కెట్లో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు వస్తాయి, దీంతో ఉద్యోగాలు కూడా అవసరం లేదనే భావనతో కడపకు చెందిన బీటెక్ చదివిన ఓ యువకుడు లక్షల్లో పెట్టుబడి పెట్టాడు. మొదట బాగున్నా తరువాత ఆ స్టాక్‌మార్కెట్ బోర్డు తిప్పేశారు. ఇతనూ పోలీసులను ఆశ్రయించాడు.

స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడులు

చాలా మంది ఉద్యోగులు, విద్యావంతులు సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాగ్రామ్, వాట్సప్ తదితర సోషల్ మీడియాల్లో వచ్చే ట్రేడింగ్ ప్రకటనలకు స్పందిస్తున్నారు. మొదట స్వల్పంగా పెట్టుబడి పెడితే తిరిగి రెట్టింపు ఇస్తారు. దీంతో వారికి ఆశ పెరిగి పోతుండడంతో పెట్టుబడి లక్షలు, కోట్ల రూపాయలకు చేరుతోంది. సైబర్ నేరగాళ్లు వారి టార్గెట్ రీచ్ కాగానే బోర్డు తిప్పేస్తున్నారు. దీంతో బాధితులకు కమ్యూనికేషన్ లేకపోవడం, ఎవరిని అడగాలో తెలియక చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. పోలీసులు కూడా బాధితుల ఫిర్యాదు తీసుకుని విచారిస్తుండగా తప్పుడు చిరునామాలతో ఈ స్టాక్‌మార్కెట్‌ను క్రియేట్ చేస్తున్నట్లు గుర్తిస్తున్నారు. ఈ స్కామ్‌లో ఎవరున్నారు, మనీ ట్రాన్స్‌ఫర్ ఎలా జరిగిందన్నదానిపై ఆరా తీసినప్పటికీ విచారణ కొంతవరకు సాగినా చివరికి ఇతర రాష్ట్రాలు, దేశాలవరకు ఈ నేరగాళ్ల లింకులు ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో సైబర్ నేరగాళ్లను పట్టుకోవాలన్నా పోలీసులకు కష్టసాధ్యంగా మారుతోంది. అత్యధిక లాభాలు వస్తాయంటూ ఆశచూపే చోట పెట్టే పెట్టుబడులతో పోయేదే కానీ వచ్చేదేమీ ఉండదు. అయినా సరే జనాల్లోని ఆశను సైబర్ నేరగాళ్లు ఆయుధంగా మలచుకుంటూ చాకచక్యంగా సొమ్ము దోచేస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలపై ఎవరూ స్పందించవద్దు. పెట్టుబడులకు రెండింతలు ఇస్తామంటే ఎవరైనా ఆశపడి డబ్బు పెట్టారంటే చివరికి ఒక్కరూపాయి కూడా రాదు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇలాంటి ప్రకటనలతో మిమ్మల్ని మోసం చేసి సైబర్ నేరగాళ్లు డబ్బులు స్వాహా చేస్తున్నారు. ఎవరైనా డబ్బులు పోగొట్టుకుంటే తక్షణమే సైబర్ సెల్‌లో సంబంధిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. లేదా 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అలాగే సైబర్‌నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

- మధుమల్లేశ్వర్‌రెడ్డి, సీఐ, సైబర్ సెల్

టీడీపీ వర్గీయులపై వైసీపీ దాడి

● కృష్ణాపురం ఘటనపై వేగంగా స్పందించిన పోలీసులు
● ఇరువురు వైసీపీ వర్గీయుల అరెస్ట్
● ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య-చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పుంగనూరు మండల కృష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ సానుభూతి పరులపై వైసీపీ సానుభూతి పరులు భూమి వివాద విషయంగా దాడి చేసి గాయపర్చినట్లు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న విషయంపై ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వేగంగా స్పందించి ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. దాడికి పాల్పడిన వేణుగోపాల్, భరత్‌లను ఆదివారం అరెస్టు చేసి కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను ఆదివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు మీడియాకు వెల్లడించారు. జిల్లా పరిధిలోని నిమ్మనపల్లి మండలం, బండ్లపై గ్రామ పంచాయతీలోని జాండ్రబైలులో నివాసం ఉంటున్న మల్లంపల్లి రామస్వామికి పుంగనూరు మండలం చెంద్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురం వద్ద సర్వే నెంబర్ 740(4)లో 3.05 ఎకరాల భూమి ఉందన్నారు. రామస్వామికి నలుగురు కుమారులు కాగా వరుసగా వేణుగోపాల్, హరినాథ్, మోహన్, మల్లికార్జునలకు వివాహాలయ్యాయన్నారు. వీరిలో వేణుగోపాల్, మల్లికార్జునలు జాండ్రబైలులో కాపురం ఉంటుండగా హరినాథ్ పుంగనూరు మండలం చెంద్రమాకులపల్లి పంచాయతీలోని కృష్ణాపురంలో కాపురం ఉంటున్నాడని తెలిపారు. మోహన్ దుబాయ్‌లో ఉంటున్నాడన్నారు. అయితే రామస్వామికి సంబంధించిన భూమిలో పెద్ద కుమారుడు వేణుగోపాల్, రెండో కుమారుడు హరినాథ్ ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటూ ఉన్నారన్నారు. వీరిలో వేణుగోపాల్ వైసీపీ సానుభూతిపరులు కాగా హరినాథ్ టీడీపీ సానుభూతిపరులుగా ఉన్నారని తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 12న శనివారం మధ్యాహ్నం వేణుగోపాల్ కొడుకు భరత్ సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా హరినాథ్ కుమారుడు వెంకటేశ్ ఈ దారిలో నడవద్దని చెప్పడంతో గొడవ జరిగిందన్నారు. భరత్ అంతటితో అక్కడి నుంచి వెళ్లిపోయి తిరిగి సాయంత్రం అతని భార్యతో కలిసి సదరు పొలం దగ్గరికి వెళ్తుండగా అక్కడ ఉన్న హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్‌లు ఘర్షణ పడ్డారు. ఇందులో హరినాథ్, వెంకటేశ్‌ను పక్కనే ఉన్న టమోటా నీడ్ కట్టెలతో భరత్ దాడి చేయడంతో రక్తగాయాలయ్యాయన్నారు. భరత్‌కు కూడా చిన్నచిన్న గాయాలయ్యాయన్నారు. ఈ విషయమై హరినాథ్, అతని కుమారుడు వెంకటేశ్ పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. భూమికి సంబంధించిన సమస్యలు, ఇతర సమస్యలు ఉంటే వాటిని చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పరిష్కరించుకోవాలని, వ్యక్తిగత కక్షలు పెంచుకుని వర్గాలు, గ్రూపులుగా ఏర్పడి ప్రజాశాంతికి విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

వృద్ధురాలి హత్య కేసును తప్పుదోవ పట్టిస్తున్నారు

● న్యాయం చేయాలని కుటుంబ సభ్యుల ఆందోళన
● ఎమ్మెల్యే చొరవతో సర్దుబాటు
● నగలు, నగదు విషయం ఎఫ్ఐఆర్‌లో చేర్చాలని ఆదేశం



బెంగళూరు రోడ్డులో బైఠాయించి నిరసన చేస్తున్న బాధితులు

మదనపల్లెఅర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన వృద్ధురాలి మెడలో ఉన్న నగలు, ఆమె వద్ద ఉన్న రూ.రెండు లక్షల నగదు విషయం వెంటనే తేల్చాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పోలీసు అధికారులను ఆదేశించారు. గంగులమ్మ అనే వృద్ధురాలిని విష్ణు అనే ఆటో డ్రైవర్ హత్య చేసి, ప్రమాదంగా చిత్రీకరించాలని ప్రయత్నించిన విషయం తెలిసిందే. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలంటూ హతురాలి కుటుంబసభ్యులు, బంధువులు సుమారు 200 మంది ఆదివారం ఉదయం తాలూకా పోలీస్‌స్టేషన్ సమీపంలోని బెంగళూరు జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. రూయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తమ పెద్దమ్మ కుమారుడు వెంకటరమణకు డబ్బు అవసరం కావడంతో, అతనికి ఇచ్చేందుకు రూ.2 లక్షలు తీసుకుని ఇంటి నుంచి బయలుదేరిందని ఆమె కుమారులు తెలిపారు. ఆర్టీసీ బస్టాండుకు వెళ్లేందుకు చంద్రాకాలనీలో ఆటో ఎక్కిందని వివరించారు. అయితే, ఆటో డ్రైవర్ సీఎస్ఐ చర్చి వద్ద దింపాడని, ఐదు రూపాయలు విషయంలో గొడవపడినట్లు పోలీసులు కట్టుకథ అల్లుతున్నారని బాధితులు ఆరోపించారు. ఐదు రూపాయల కోసం హత్య చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ చూపడం తప్పన్నారు. తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ గంగులమ్మ మనుమడు మనోహర్ ఒంటిపై పెట్రోల్ పోసుకోవడంతో పోలీసులు, కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే షాజహాన్ బాషా అక్కడికి చేరుకుని బాధితులకు అండగా ఉంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. ఎమ్మెల్యే బాధితులతో పాటు పోలీస్‌స్టేషన్ వద్దకు వచ్చి బాధితుల ఫిర్యాదును, పోలీసులు నమోదు చేసిన ఫిర్యాదులోని వివరాలను ఎస్ఐ గాయత్రితో చదివించారు. ఎఫ్ఐఆర్‌లో గంగులమ్మ మెడలో ఉన్న నగలు, రెండు లక్షలు క్యాష్ విషయం లేదని, వెంటనే చేర్చి దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మృతదేహాన్ని పరిశీలించి శ్రద్ధాంజలి ఘటించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బాధితులకు అప్పగించారు. రూరల్ సీఐ సత్యనారాయణ, టూటౌన్ సీఐ రామచంద్ర, టీడీపీ నాయకులు హరిబాబు, చెంద్రాయులు, గురునాథ్, బాబా పాల్గొన్నారు.


చెన్నూరు ఎస్‌బీఐలో చోరీకి విఫలయత్నం

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు ఎస్‌బీఐలో గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలగొట్టి లోపలికి ప్రవేశించి బ్యాంకు సేఫ్ లాకర్లను బలవంతంగా ఓపెన్ చేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు. బ్యాంకులో బయటి వైపు ఉన్న సీసీ కెమెరాల వైర్లు కట్ చేసి సీసీ ఫుటేజీ (డీవీఆర్) తీసుకెళ్లారు. అంతేకాక బ్యాంకు క్లోజింగ్ బ్యాలెన్స్ అమౌంటు సుమారు రూ.20వేలు చోరీ చేశారు. ఆదివారం సాయంత్రం బ్యాంకులో పనిచేసే మెసెంజరు లైటు వెలగకపోవడంతో ఈ విషయం బ్యాంకు సిబ్బందికి తెలిపారు. వారు పోలీసు సిబ్బందికి సమాచారం తెలిపారు. బ్యాంకు మేనేజరు సుజిత ఈ విషయాన్ని పై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సీఐ, డీఎస్పీ వెంకటేశ్వరరావు, తాలుకా సీఐ వెంకటేశ్వర్లు, క్లూస్‌టీం సిబ్బంది బ్యాంకు పరిసరాలను గమనించారు. ఈ విషయంపై కడప డీఎస్పీ మాట్లాడుతూ దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మెడికల్ ఏజెన్సీలో చోరీ

రూ.1.21 లక్షలు అపహరణ

కడపక్రైం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరం బీకేఎం వీధిలో ఈశ్వర్ మెడికల్ ఏజెన్సీలో దొంగలు నగదును అపహరించినట్లు కడప టూటౌన్ ఎస్ఐ హుసేన్ తెలిపారు. ఆయన వివరాల మేరకు కడపకు చెందిన శివకుమార్ ఈ నెల 11న రాత్రి ఏజెన్సీ మూసి ఇంటికి వెళ్లాడు. తిరిగి ఉదయం వచ్చి చూసేసరికి దొంగలు ఏజెన్సీ షట్టరు పగలగొట్టి రూ.1.21 లక్షల నగదును అపహరించినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.



PART TIME JOBS

బద్వేల్ టౌన్, నెల్లూరు రోడ్డులో సత్యాగ్రూపు వారి ద్వారకా గ్రాండ్‌లో సులభ వాయిదాలలో విలువైన ప్లాట్లు సేల్ చేయుటకై మార్కెటింగ్ ఏజెంట్స్ కావలెను. పార్ట్‌టైం జాబుగా, ఆసక్తి గలవారు సంప్రదించండి. CEO సత్యాగ్రూప్, 97037 27786, 79895 76111
Ajc-233711

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ సంప్ర: 7382114647.
AJA- 227139

CHANGE OF NAME

SHAIK MOHAMMAD ALI, S/o. SHAIK AHAMMED HUSSAIN, Passport No. W7984386, residing at D.No.8/404-1, Almaspet, YSR District, A.P. 516001, and his name has been changed to SHAIK MOHAMMAD ALI (New Name) previously called MOHAMMED ALI SHAIK (Old Name) which is shown in his Daughter SHAK BIBI KUBRA Passport bearing No.U2209403
AJC-233679

CHANGE OF NAME

SHAIK RAZIA BEGUM, W/o. SHAIK AHMED HUSSAIN, Passport No.V4317530, residing at D.No.11/136-1, Kummara Kunta, Kadapa, YSR District, A.P. and her name has been changed to SHAIK RAZIA BEGUM (New Name) previously called SHAIK RAJIYA BEGUM (Old Name).
AJC-233679

10th,ఇంటర్,డిగ్రీ పాసయ్యే ఛాన్స్

చదువు మధ్యలో ఆపేసిన (లేదా) ఫెయిల్ అయిన వారికి 10th, ఇంటర్, డిగ్రీ పాసయ్యే ఛాన్స్ కలదు. కడప సెల్: 90105 01122.
Ajc-233716

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను

ప్రొద్దుటూరు, మైదుకూరు నందు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. డ్యూటీ 12 గంటలు అర్హత. 10th, జీతం 9500-10,500 వరకు సంప్రదించవలసిన నెంబరు : 63000 09168, 88865 60670
Ajc-233760

ఇల్లు బాడుగకు ఇవ్వబడును

C.M.R. పల్లె Union Bank మేడపైన 1st Floor నందు Single Bedroom ఇల్లు బాడుగకు ఇవ్వబడును. సంప్రదించండి సెల్ నెంబర్ : 89786 27496
Ajc-233681

LOSS OF PASSPORT

I, SYED JALALUDDIN S/o. SYED IQBAL, R/o. D.No.10/7 28-1,Bellam Mandy Street, Kadapa City, Y.S.R Kadapa District, A.P.- 516001, have lost my Passport Bearing No: K6123983, While Traveling in Bike my House to Ameen Peer Road, Bellary Road, Kadapa, YSR Kadapa District. If anybody found please contact above address.
AJC-233680

యూనిట్ కార్యాలయం
9985411183
9985411189

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

అంధకారంలో రిమ్స్ ఆసుపత్రి ముఖద్వారం



కడప సెవెన్‌రోడ్స్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): అది జిల్లా ప్రజల ఆరోగ్యాలను పరిరక్షించే రిమ్స్ ఆసుపత్రి ముఖద్వారం. రోగుల జీవితాలకు వెలుగులు ప్రసాదించే ఆ ఆసుపత్రి ముఖద్వారం అంధకారంలో ఉంది. దీంతో వివిధ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి చేరుకునే వారికి అక్కడ చీకటి స్వాగతం పలుకుతున్నట్లుగా వుంది. రోగుల జీవితాలకు వెలుగులు పంచే తనకు ఎప్పుడు వెలుగులు వస్తాయోనని రిమ్స్ ఆసుపత్రి ముఖ ద్వారం రోధిస్తున్నట్లుగా వుంది. ఇప్పటికైనా ఆ చీకటి తెరలు తొలగించి వెలుగులు ప్రసరింపచేసేలా విద్యుత్‌దీపాలు వెలిగేలా చూడాల్సివుంది.

ఇక్కడే కుళ్లిపోవాల్సిందేనా..?



కడప సెవెన్ రోడ్స్ ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కడప కార్పొరేషన్ పరిధిలోని రిమ్స్ వద్ద ఉన్న సింగపూర్ సిటీలో కొద్దిరోజులుగా చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. చెత్త డబ్బా నిండినప్పటికీ కార్పొరేషన్ సిబ్బందిక్లీన్ చేయకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త డబ్బా నిండడంతో దుర్గంధం వెద్దజల్లుతూ స్థానికులకు రోగాలు గురయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ కార్పొరేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

కంపు బాబోయ్ కంపు..!

●మున్సిపాలిటీలో పడకేసిన పారిశుధ్యం ● కాలువల్లో పేరుకుపోయిన చెత్త ●ఎక్కడి మురుగు అక్కడే..!

●పందుల స్వైరవిహారంతో ప్రజల ఇక్కట్లు ●దోమల దండయాత్ర ●నిద్రావస్థలో అధికారులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. చాలా వీధుల్లో చెత్త పేరుకుపోయి కనిపిస్తోంది. కాల్వల్లో రోజుల తరబడి మురుగు తీయకపోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయింది. దీంతో చాలా వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. గతంలో స్వచ్ఛభారత్ రేటింగ్‌లో రాష్ట్రంలో ప్రధమ స్థానంలో నిలిచిన పులివెందుల మున్సిపాలిటీ ఇప్పుడు మురికిపాలిటీగా మారింది. శానిటేషన్ ఇన్‌స్పెక్టరు లేకపోవడం, ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టరు సరిగా పట్టించుకోక పోవడంతో ఈ దుస్థితికి కారణమైంది. సిబ్బంది కొరత కూడా కొంత సమస్యగా మారింది. పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన అధికారులు కూడా పట్టీపట్టనట్లు వ్యవహరించడంతో రోజురోజుకూ పారిశుధ్య సమస్య తీవ్రమవుతుంది.

నెలకు ఒక్కసారి కూడా శుభ్రం చేయడంలేదు

మున్సిపాలిటీలో 135 మందికి పైగా కార్మికులున్నా తగు రీతిలో పని జరగడంలేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. దీంతో కాల్వల్లో చెత్త చెదారం పేరుకుపోయి కనిపిస్తుంది. ప్రధాన వీధుల్లో మినహా నివాస ప్రాంతాల్లో మురుగుకాల్వలు నెలకు ఒకసారి కూడా శుభ్రం చేయని పరిస్థితి. మరో పక్క ప్రధానదారుల్లో పరిశుభ్రత లోపించింది. శ్రీనివాస్ థియేటరు సమీపం, ఇష్టాపురం, రోటరీ పురం, వేమకాలనీ, ఎర్రగుడిపల్లె, ఆర్టీసీ బస్టాండు, భాకరాపురం పరిసర ప్రాంతాలు దుర్గంధం వెదజల్లుతున్నాయి.

●పెరిగిన దోమలు..: కాల్వల్లో మురుగు నీరు నిల్వ ఉండడంతో దోమలు విజృంభిస్తున్నాయి. చీకటిపడితే దోమలు దాడి చేస్తున్నాయి. రాత్రి అయిందంటే తలుపులు, కిటికీలు మూసుకుని ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. గతంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల పేరుతో ఫాగింగ్, కాల్వల్లో దోమల నివారణకు మందు స్ప్రే చేయడంలాంటివి చే పడుతూ వచ్చారు. కానీ ఇప్పుడు మాత్రం పట్టించుకునే నాథుడు కరువయ్యారు.





కడప రోడ్డులో స్వైర విహారం చేస్తున్న పందులు, కాల్వల్లో పేరుకుపోయిన మురుగునీరు

●పారిశుధ్య సిబ్బంది కొరత..: పులివెందుల మున్సిపాలిటీ పరిధి నానాటికీ పెరుగుతోంది.కొన్ని గ్రామాలు కూడా తిరిగి మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. ఉన్న పారిశుధ్యసిబ్బందితో మొత్తం పనిచేయించడం కష్టతరంగా ఉందని అధికారులు అంటున్నారు. 'పట్టణంలో పూర్తిస్థాయి పారిశుధ్యం జరగాలంటే కనీసం మరో 50 మంది కార్మికులు అవసరం అవుతారని అంచనా.

మెరుగైన పారిశుధ్య చర్యలు చేపడతాం



పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారిస్తాం. ప్రజల్లో అవగాహన కల్పిస్తాం. పదిరోజులకు ఒకసారి ఫాగింగ్ చేయడంతో పాటు తడి పొడి చెత్త వేరు చేయండ, వ్యర్థాలు నిల్వ లేకుండా చేస్తున్నాం. ఖాళీ స్థలాల్లో నిల్వలపై స్థల యజమానులు స్పందించాల్సి ఉంది. వారు స్థానింగా లేక కొంత ఇబ్బందిగా ఉంటుంది. పందుల యజమానులతో కూడా మాట్లాడి పూర్తిస్థాయిలో పట్టణంలో పందులు సంచరించకుండా అరికడతాం.

రాముడు,కమిషనరు

●పందుల స్వైరవిహారంతో ఇక్కట్లు..: ఎర్రగుడిపల్లె, రాజారెడ్డికాలనీ, కడప రోడ్డులో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వార్డులలో పేరుకుపోయిన మురుగునీటిలో పందుల కారణంగా దుర్వాసన వెలువడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పందుల కారణంగా దోమలు కూడా విపరీతంగా పెరిగాయని, వీటి వల్ల సీజనల్ వ్యాధులు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● పర్యవేక్షణ శూన్యం..: పట్టణంలో పారిశుధ్య పరిస్థితుల పర్యవేక్షణ మరీ దారుణంగా ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో పని ప్రదేశాల్లో తిరుగుతూ పారిశుధ్య పనులు పర్యవేక్షించాల్సిన శానిటరీ ఇన్‌స్పెక్టరు అసలు పట్టించుకోవడంలేదు. కమిషనరు, ఇతర అధికారులు పర్యవేక్షణ పూర్తిగా తగ్గింది. దీంతో పారిశుధ్యం క్షీణించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

కడప కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రెడ్డిసేవా సంఘం సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక రాజీవ్‌మార్గ్ రోడ్డులో ఉన్న రెడ్డి హాస్టలు లో విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రస్తుత ఆధునిక యువతకు ఏది ముఖ్యమో.. మానవ విలువలా (సద్గుణా లు) లేక శాస్త్రసాంకేతిక పరిజ్ఞానమా అనే అంశంపై పోటీలు నిర్వహించారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా చిన్మయామిషన్ అధ్యక్షుడు స్వామి తురీయానంద సరస్వతి, వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసరు జయచంద్రారెడ్డి, వైవీయూ వ్యాయామ విద్య అసోసియేట్ ప్రొఫెసరు రామసుబ్బారెడ్డి వ్యవహరించారు. ఇందులో దాదాపు 84 మంది వివిధ పాఠశాలల నుంచి హాజరయ్యారు. మొదటి విజేతలుగా ఎం.సుశ్రుత, నూరుల్‌హుదా, రెండో బహుమతిని తేజస్విని, గాయత్రి, మూడో బహుమతిని దివ్య, వెంకటదివ్య నిలిచారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు నాగిరెడ్డి, కొండారెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత

వేంపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ధ్యాన బుద్ధ హిమాలయ యోగి కళాధర్ రెడ్డి తెలిపారు. వేంపల్లెలోని చైతన్య హైస్కూల్లో శనివారం రాత్రి పౌర్ణమి ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మజ్ఞానం మనిషి జీవన ప్రయాణానికి మార్గదర్శకం అనే అంశంపై వివరించారు. కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ధ్యాన ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. అనంతరం కళాధర్‌రెడ్డిని కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, హాజరైన ప్రతినిధులు శాలువతో సత్కరించారు.

గంగమ్మతల్లికి పూజలు

సీకేదిన్నె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చింత కొమ్మదిన్నె మండలం కొత్తపేట వద్దగల గంగమ్మ తల్లికి భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. ఆదివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు.

టెక్నాలజీదే భవిష్యత్తు

సీకేదిన్నె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తు అంతా టెక్నాలజీపైనే ఆధారపడి ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే చీఫ్ ఇంజనీరు బి.క్రిష్టారెడ్డి తెలిపారు. స్థానిక కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాతీయస్థాయి టెక్నో కల్చరల్ టెస్ట్-2కె25 ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ఆవిష్కరణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. వేద ఐఐటీ డైరెక్టర్ సుబ్బరంగయ్య మాట్లాడుతూ ఇలాంటి ఫెస్టివల్స్ విద్యార్థుల్లో లీడర్‌షిప్, టీంవర్క్, సాంకేతిక నైపుణ్యాల కలయికకు ఒక వేదికగా నిలుస్తాయన్నారు. కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళలుసైతం టెక్నికల్ రంగాల్లో ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఎండీ చంద్ర ఓబుళరెడ్డి, వైస్‌ఛైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు సాంకేతిక, సాంస్కృతిక వ్యక్తిత్వ అభివృద్ధికి కళాశాలలో అన్ని అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, టీటీడీ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాగరాజు, ఏపీఎస్పీడీసీఎల్ డివిజనల్ ఇంజనీరు లక్ష్మీపతి, ఆదినారాయణరెడ్డి, ప్రసాద్, కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా శోభాయాత్ర, భారీ స్కూటరు ర్యాలీ



శోభాయాత్ర, భారీ స్కూటరు ర్యాలీ నిర్వహిస్తున్న యువత

కడప కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకుని నగరంలో ఆదివారం సాయంత్రం ఆకులవీధిలో ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయం నుంచి భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బైకు ర్యాలీలో యువకులు పెద్దఎత్తున పాల్గొని ద్విచక్ర వాహనాల్లో ఆంజనేయుడు, శ్రీరామచంద్రుడి చిత్రాలు గల జెండాలు పట్టుకుని ర్యాలీ చేశారు. ఈ ర్యాలీ అప్సర సర్కిల్, కొత్తబస్టాండు, మహవీర్‌సర్కిల్, ఐటీఐ, వినాయకనగర్, పాతబస్టాండు మీదుగా ఆంజనేయస్వామి శ్రీగాలిదేవర ప్రసన్నాంజనేయస్వామి ఆలయానికి చేరుకుని ముగిసింది. ఈ కార్యక్రమంలో హిందువులు, విశ్వహిందూ పరిషత్, బీజేవైఎం, బీజేపీ, భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

'ఆదివాసీలపై నరమేధం ఆపాలి'

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నరమేధాన్ని ఆపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన కడపలోని ఇంజనీర్స్ భవన్‌లో జరిగే జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, పీకేఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ, ఆర్‌పీపీ సభ్యులు హమీద్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పుత్తా నరసింహారెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్యే



కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డిని కడప ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. మోకాలి శస్త్ర చికిత్స జరిగిన నేపథ్యంలో ఆదివారం స్టార్ ఆసుపత్రిలో వారు పుత్తా నరసింహారెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

ఘనంగా మాంటిస్సోరీ జగతి ఇంటర్నేషల్ స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న లేవాకు రఘునాథరెడ్డి, విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న కరస్పాండెంట్ నితీష్‌రెడ్డి

సీకేదిన్నె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించాలని ఎంఈవో గంగిరెడ్డి తెలిపారు. స్థానిక మాంటిస్సోరీ జగతి స్కూల్‌లో ఆదివారం వార్షికోత్సవం వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన ఎంఈవో మాట్లాడుతూ విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని, అందుకు స్కూల్ యాజమాన్యం అవసరమైన ఆటస్థలం డిజిటల్ ప్యానెల్, పెద్ద క్లాస్‌రూములు, అనుభవం, అర్హతగల ఉపాధ్యాయులను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

కరస్పాండెంట్ నితీష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పునాదులు వేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో శ్రీహరి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, డీసీసీబ్యాంకు మాజీ సీఈవో లేవాకు రఘునాథరెడ్డి, రామిరెడ్డి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ సలోమి, ప్రిన్సిపాల్ రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో సౌకర్యాల కల్పనకు చర్యలు



మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో అన్ని మౌలిక సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో ఉన్న ఓబీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన వెంట వార్డన్ వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

మానవత డైరీని ఆవిష్కరించిన ఎమ్మెల్సీ..: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ డైరీని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఆదివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహించిన ఆత్మీయ సహకారం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, నర్రెడ్డి శివప్రకాష్‌రెడ్డి, మానవత ప్రతినిధులు కొండారెడ్డి తదితరులుపాల్గొన్నారు.

18న మునీశ్వరస్వామి వేడుకలు

వీరపునాయునిపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్వరాజుపేట డ్యాం వద్ద ఉన్న మునీశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18వ తేదీన నాగభైరవేశ్వర స్వామికి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులకు అన్నదానం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

ప్రతిభావంతులైన బాలికలకు ఉచిత విద్య, వసతి

కడప(వినాయకనగర్), ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): అర్హులైన నిరుపేద, తల్లిదండ్రులు లేని ప్రతిభ కలిగిన బాలికలకు విద్య అవకాశాలను అందించేందుకు కడప ఆర్తీ హోమ్ నేతృత్వంలో వినూత్న కార్యక్రమం ప్రారంభించిందని పాఠశాల ప్రధానాచార్యులు తెలిపారు. కాగా 10వ తరగతి పూర్తి చేసిన నిరాశ్రయులు లేదా ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన బాలికలకు ఉచిత విద్య, వసతి అందించేందుకు ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. కాగా 10వ తరగతి పూర్తి చేసిన, ఆర్థికంగా వెనుకబడిన బాలికలు అర్హులన్నారు. ఆర్తీ హోం కడపలో ఈ నెల 25న సామర్థ్య పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఉచిత విద్య, కెరీర్ మార్గదర్శనం చేస్తామన్నారు. వివరాల కోసం 8074717196, 8331951098 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ప్రజల సెంటిమెంటును గౌరవించడం తెలియదా?

చెన్నూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేటలో గంగ జాతర సందర్భంగా అక్కడ ఆనవాయితీగా చేసుకుంటున్న పూజలకు అటవీశాఖ సిబ్బంది అడ్డమయ్యారు. ఫారెస్టు బంగ్లాలో చాలా ఏళ్ల నాటి వేపచెట్టుకు ప్రతి యేటా జాతర రోజు పంచాయతీ ప్రజలు పూజలు చేసేవారు.అనంతరం జాతర మొదలుపెట్టేవారు. అయితే ఇటీవల ఆ బంగ్లా చుట్టూ ఫెన్సింగ్ వేయడం, అలాగే గేటు ఏర్పాటు చేసి తాళం వేశారు. కాగా ఆదివారం జాతర మొదలుపెట్టేందుకు ముందు ఫారెస్టుబంగ్లాలోని వేపచెట్టుకు పూజలు చేసుకోవాలనుకుని అధికారులకు ఫోను చేశారు. అయితే ఫోను చేసినా పలకడంలేదు. అయితే ఉదయం 5గంటలకు చేసుకోవాల్సిన పూజలు 9.30 వరకు కూడా గేటు తీయలేదు. కాగా మండల టీడీపీ కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి ఫారెస్టు సిబ్బందికి ఫోను ద్వారా విషయం వివరించడంతో సిబ్బంది చాలా సేపటి తర్వాత వచ్చి గేటు తెరవడంతో స్థానిక ప్రజలు వెళ్లి వేపచెట్టుకు పూజలు చేశారు.

మోక్షానికి మార్గం రామనామం

కడప కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): శ్రీవిశ్వావసు నామ సంవత్సరం శ్రీరామ నవమి పర్వదిన పురస్కరించుకుని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి - హిందూ జ్ఞానవేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం నగర తిలక్‌నగర్‌లో త్రైత సిద్ధాంత ఆదికర్త ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రాసిన త్రైత సిద్ధాంత భగవద్గీత నూరు రకాల త్రైత సిద్ధాంత గ్రంథాలను ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు నవనీశ్వర్‌రెడ్డి, సామ్రాట్ వాసంతి, నవ్య ధన్వంతరి, వెంకటరమణ, ఈశ్వర్, సందానందుడు, శివ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్లు రద్దు చేయాలి



ర్యాలీ చేస్తున్న మైనార్టీ నాయకులు

కడప మారుతీనగర్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పార్లమెంటులో ఆమోదించబడిన వక్ఫ్‌బోర్డు అమెండ్‌మెంట్ బిల్లును వెంటనే రద్దు చేయాలని లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని వక్ఫ్‌బోర్డు జాయింట్‌యాక్షన్ కమిటీ నాయకులు ప్రభుత్వాలకు హెచ్చరికలు జారీ చేశారు. ఇందుకు నిరసనగా ఆదివారం వక్ఫ్‌బోర్డు జాయింటు యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నబీకోట నుంచి పెద్దఎత్తున ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈ ర్యాలీ పాత బస్టాండు మీదుగా నాగరాజుపేట, సీఎస్ఐ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, సెవెన్‌రోడ్స్ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో పలువురు మత గురువులు, ముస్లింలు, వివిధ పార్టీలో గల మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవాలు



రాతిదూలాన్ని లాగుతున్న ఎద్దులు

కమలాపురంరూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కమలాపురం ఉరుసు మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. దర్గా ఆవరణంలో ఏర్పాటు చేనసిన ఖవ్వాలీ పోటీపోటీగా సాగింది. ఢిల్లీకి చెందిన బులీ బ్రదర్స్, యూపీకి చెందిన సర్ఫరాజ్ అన్వర్ సాబిరి మధ్య ఖవ్వాలి పోటీ ఉత్సాహభరితంగా సాగింది. కాగా రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు పోటాపోటీగా జరిగాయి. 11 జతల ఎద్దు పోటీలో తలపడ్డాయి. ప్రొద్దుటూరు అయోధ్యనగర్‌కు చెందిన బీసీఎస్ ఆర్ బుల్స్ అధినేత వెంకటసాయి భరత్‌రెడ్డి ఎద్దు అత్యధి కంగా 5107 అడుగులు రాతి దూలాన్ని లాగి ప్రథమ స్థానం లో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు దాతలు నగదు బహుమతులు అందించారు.

డీఏ, ఐఆర్‌లను వెంటనే ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పింఛనర్లకు కరువుభత్యం, 30శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరం ఏపీటీఎఫ్ కార్యాలయంలో ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ 2024 జనవరి నుంచి మూడు విడతల కరువుభత్యం కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని రాష్ట్ర ప్రభుత్వం కనీసం ఒక్క డీఏ కూడా ప్రకటించలేదన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఖాదర్ బాష, శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ కృష్ణాజిల్లా, మచిలీపట్నం 10వ అదనపు జడ్జి వారి కోర్టులో
A.S.No. 77/2024
Between :
గుడిమెళ్ళ విజయలక్ష్మీ ... అప్పెలెంటు
మరియు
శ్రీమాన్ తట్టా రంగాచార్యులు (Died) మరియు వగైరా ... రెస్పాండెంట్లు
To, 9వ, రెస్పాండెంటు :
తట్టా వైదేహి, D/o. (లేటు) వరదాచార్యులు W/o. R.S. రమేష్, ఫ్లాట్ నెం. 39/337-3 ఓంశాంతి నగర్, 1వ రోడ్డు, కడప, కడప జిల్లా.
పైనెంబరు అప్పీలులో 9వ రెస్పాండెంట్ అయిన మీకు నోటీసు అమలు నిమిత్తం ది. 8-5-2025నకు వాయిదా అయివున్నది. కావున సదరు వాయిదా రోజున ఉదయం గం. 10-30 ని.లకు మీరు పైకోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.
మచిలీపట్నం J.M. ప్రసాద్ (J.P)
ది. 13-4-25 అప్పెలెంటు తరపున అడ్వకేట్

ఘనంగా మట్టల ఆదివారం పండుగ



కమలాపురం చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఉన్న చర్చిలలో ఆదివారం, మట్టల పండుగ మహోత్సవాన్ని నిర్వహించారు. గుడ్‌ఫ్రైడేకి ముందుగా వచ్చే ఆదివారం క్రైస్తవులు మట్టలపండుగను నిర్వహించుకున్నారు. కమలాపురంలోని ఆర్సీయం చర్చిలో ఫాదర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో రామచంద్రాపురం గ్రామం నుంచి ఆర్సీయం చర్చి వరకు,సీఎస్ఐ టౌన్ చర్చిలో రెవరెండ్ యు.సాల్మన్ బాబు ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలు చేతపట్టుకుని ఊరేగింపుగా ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ సతీష్‌కుమార్, పాస్టర్ సాల్మన్, సీఎస్ఐ టౌన్ చర్చి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కడప ఎర్రముక్కపల్లె..:ప్రజలు శాంతి సమాధానంతో జీవించాలని సీఎస్ఐ సెంట్రల్ చర్చి పాస్టర్ విక్టర్ రాజజు పిలుపునిచ్చారు. ఆదివారం కడప నగరంలోని సీఎస్ఐ సెంట్రల్ చర్చిలో భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఉమెన్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ పద్మ విక్టర్, చర్చి సెక్రటరీ మనోహర్‌బాబు, కోశాధికారి డానియేల్, సంఘ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కడప కల్చరల్..: శాంతి సమాధానాలతో ప్రజలందరూ ముందుకు సాగాలని న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ అధ్యక్షుడు పాస్టర్ పి.మహేశ్ సూచించారు. మట్టల ఆదివారాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక 48వ డివిజను కృపా కాలనీ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మాట్లాడారు. విశ్వాసులు పెద్దఎత్తున చర్చిలో పాల్గొని ఏసుప్రభు చల్లని దీవెనలు పొందేందుకు విజయానికి నిదర్శనంగా ఖర్జూరపు మట్టలు, పరిశుద్ధ గ్రంథం చేతబట్టి ప్రభువు కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో రవితేజ, శాంతిరాజు, కిరణ్, రోజా, శిరీషా పాల్గొన్నారు.



రేషన్ కోసం కార్డుదారుల పాట్లు

- సక్రమంగా బియ్యం అందడంలేదంటూ లబ్ధిదారుల ఆందోళన
- తూకాల్లో మోసాలు వస్తున్నాయంటూ ఆరోపణలు


ఎండీయూ వాహనాన్ని అడ్డుకుని నిరసన తెలుపుతున్న మహిళలు


డీలర్‌తో వాగ్వాదం చేస్తున్న కార్డుదారులు

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదంటూ కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏప్రిల్ 15వ తేదీ వస్తున్నా ఇంకా బియ్యం అందడంలేదంటూ వాపోవడమే కాకుండా ఇక తూకాల్లో భారీగా అక్రమాలు జరుగుతున్నాయంటూ ఆరోపిస్తున్నారు. ప్ర జాపంపిణీపై ఎర్రగుంట్లలో పేదలు ఆందోళనబాట పడుతూనే ఉన్నా రు. కొందరు ఎండీయూ వాహనం నెలల కొద్ది తమ కాలనీలకు రావడం లేదంటూ మండిపడుతు న్నారు. గత 10నెలలుగా ఎండీయూ వాహనమే రావడంలేదని, రేషన్‌కోసం తాము తీవ్ర పరేషాన్ అవుతున్నామని, కార్డు దారులు ఆగ్రహజ్వాలలు వ్యక్తం చేస్తున్నారు. కూలిపనులు పోగొట్టుకుని మండుటెండలో నిల్చుంటే కూడా రేషన్ బియ్యం దొరకడంలేదని డీలర్లపై నా ఎండీయూ ఆపరేటర్లపైనా కార్డుదారులు వాగ్వాదానికి దిగుతున్నారు. ఇందుకు నిదర్శనంగా గత రెండు రోజుల క్రితం ఎర్రగుంట్ల పట్టణంలో కార్డుదారులు రేషన్ కోసం డీలర్ తోపాటు ఎండీయూ వాహనాన్ని అడ్డుకు ని ఎందుకు బియ్యం పంపిణీ చేయలేదంటూ నిరసనకు దిగారు పెద్దఎ త్తున ఆందోళన జరుగుతున్నా రెవెన్యూ అధికారులు అటు వైపు తొంగి చూసిన పాపాన పోలేదంటూ కార్డుదారులు పేర్కొంటున్నారు. గత పది నెలలుగా ఎర్రగుంట్లలోని 5, 6, 9 దుకాణాలలో రేషన్ పంపిణీ గందర గోళంగా మారింది.ఈ మూడు షాపులకు ఒకే ఎండీయూ వాహనం ఉం డడంతో కష్టాలు తప్పడంలేదంటున్నారు. గత నెలలోకూడా సక్ర మంగా బియ్యం పంపిణీచేయలేదని అయితే బ్లాక్ మార్కెట్ తరలిపోతున్నాయని కార్డుదారులు వాపోతున్నా రు. ఈవిషయం పై గత నెలలో 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో ఈ నెల సంబంధిత ఎండీయూ వాహనం కాకుండా మరో వాహనాన్ని తిప్ప డం విశేషం. అయితే 6వ షాపు నుంచి బియ్యం పంపిణీకి వెళుతుండగా గమనించిన అక్కడి మహిళలు అడ్డగించి దాన్ని తమ వీధిలోకి తీసుకె ళ్లారు. 9వ షాపు వారు బియ్యం వేయడం లేదని, రేషన్ పంపిణీ చేయా లంటూ చుట్టుముట్టారు. ఈ బియ్యం తమ షాపు పరిధిలోని వారికి మా త్రమే వేస్తామని, మిగతావారికి ఇవ్వమని రేషన్ డీలర్ రమేశ్ కార్డుదా రులతో వాగ్వాదానికి దిగాడు. బియ్యం ఎక్క డైనా తీసుకోవచ్చని ముందు మా వీధిలో పంపిణీ చేసిన తరువాత ముం దుకెళ్లాలని మహిళలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకించారు. కార్డుదారులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకు న్నారు. ఈలోగా డీలర్ బంధువు ఈపాస్ మిషన్ ను తీసుకెళ్లడంతో సమ స్య జఠిలమైంది. పదినెలలుగా వాహనం ఇళ్లవద్దకు రావడంలేదని కార్డు దారులు ఆరోపించడమే కాకుండా అనేకసార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని విమర్శించారు.

స్పందించని సంబంధిత రెవెన్యూ అధికారులు

ఎర్రగుంట్లలో రేషన్ బియ్యం సరిగా పంపిణీ చేయడంలేదంటూ కార్డుదా రులు ఆందోళన చేయడమే కాక ఎండీయూ వాహనాన్ని అడ్డుకున్నా అధికారులు అటువైపు రాకపోవడం శోచనీయం. ఈ ఘటనపై సంబంధిత తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ అధికారుల వివరణ కోసం 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా వారు అందుబాటులో లేరు.

ప్రతిభావంతులకు పట్టం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం, కళారంగాల్లో ప్రతిభ కనపరిచిన కళాకారులు, సాహితీవేత్తలను గుర్తించి తమ సంస్థల ఆధ్వర్యంలో సత్కరించడం సంతోషంగా ఉందని చదువుల సాహిత్య కళావేదిక బాలసాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ అధ్యక్షుడు డీకే చదువులబాబు అన్నారు. ఆదివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలు మైదానంలోని గ్రేడ్-1 గ్రంథాలయంలో కేంద్రసాహిత్య అకాడమి యువపురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ రచించిన సారలపిల్లి పుస్తక పరిచయం, గద్వాల సోమన్న రచించిన పూలసగ్గ పుస్తకావిష్కరణ నిర్వహించారు. అలాగే నాటక రంగానికి విశేష సేవలు అందిస్తున్న మూలమల్లికార్జునరెడ్డి, కొత్తపల్లె శ్రీను, కంబం పాములేటిలకు నటభూషణ పురస్కారం అందజేశారు. కవి సీవీ సురేష్ రచయితలు జింకా సుబ్రమణ్యం, తవ్వా వెంకటయ్య, వంశి, ముహమ్మద్‌బాష, సాహితీవేత్తలు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

ఎస్ఐకి సన్మానం

కొండాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎమ్మార్పీఎస్ నాయకులు కొండాపురం ఎస్ఐ ప్రతాప్‌రెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆయనను, వారు పూలమాలవేసి సన్మానించారు. కొండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ సందర్భంగా ఎస్ఐని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శ్రీనివాసులు, నాగ సుబ్బరాయుడు, నాగన్న, కరుణాకర్, పెద్దన్న, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.





'ఆదివాసీలపై నరమేధం ఆపాలి'

ప్రొద్దుటూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం సాగిస్తున్న నర మేధాన్ని ఆపాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి చీమలపెంట వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సృజన సామాజిక వేదిక కార్యాలయంలో ఈ నెల 20వ తేదీన కడపలోని ఇంజనీర్స్ భవన్‌లో జరిగే జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని కోరుతూ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆదివాసీలు విస్తరించి ఉన్న చత్తీస్‌ఘడ్, బస్తర్ మధ్యప్రదేశ్, ఒడిశా అడవుల నుంచి వారిని తరిమివేసి అడవుల్లో ఉన్న లక్షల కోట్ల విలువైన ఖనిజ సంపదను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకు ప్రధాని మోదీ గద్దె ఎక్కినప్పటి నుంచి నరమేధం కొనసాగిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా ఆదివాసీలకు అండగా ఉన్న మావోయిస్టులపై దాడులు చేస్తున్నారన్నారు. వెంటనే సాయుధ బలగాలను ఆదివాసీ ప్రాంతాల నుంచి వెనక్కి రప్పించాలన్నారు. దేశ ప్రజల సమస్యల కోసం సాయుధపోరాట మార్గం ఎంచుకున్న పార్టీలతో ప్రజాస్వామ్య ప్రభుత్వాలు చర్చలు జరిపి పరిస్థితిని నియంత్రించాలన్నారు. 20న కడపలో జరిగే ఈ సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవి శంకర్‌రెడ్డి, విరసం కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబు, పీకేఎస్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, మహిళా శక్తి కార్యదర్శి వడ్ల లక్ష్మీదేవి, నాస్తిక సమాజం కన్వీనర్ పల్లవోలు రమణ, ఆర్‌పీవీ సభ్యులు హమీద్, పద్మ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మట్టల ఆదివారం

రాజుపాలెం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గుడ్‌ఫ్రైడే ముందస్తు సందర్భంగా మట్టల ఆదివారాన్ని మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. టంగుటూరు గ్రామంలో మహిళలంతా ఈత మట్టలు పట్టుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. **జమ్మలమడుగులో:** జమ్మలమడుగు సీఎస్ఐ క్రైస్ట్ టౌన్ చర్చి పట్టణంలోని ఇతర చర్చిలలో ఆదివారం మట్టల ఆదివారంను పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గురువు రెవరెండ్ దీనజనార్ధన్‌బాబు సర్వసృష్టికర్త అయిన ప్రభువు సాధారణ మానవుని వలే ఈ లోకానికి వచ్చారని తెలిపారు. ఈ ప్రత్యేక ప్రార్థనల్లో సంఘ సభ్యులు, సెక్రటరి మధుకుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఎండలకు తగలబడిన కంపోస్టు యార్డు

ప్రొద్దుటూరు , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలకు పొట్టిపాడు రోడ్డులోని మున్సిపల్ కంపోస్టు యార్డు తగలబడి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించాయి. ఆదివారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ మంటలు సాయంత్రం వరకు రగిలాయి. కంపోస్టు యార్డులో కొంత ప్రాంతం తగలబడి బుడిద అయ్యింది. కంపోస్టు యార్డులో మంటలను ఆపాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పబ్లిక్ హెల్త్ అధికారులను ఆదేశించడంతో వారు ఫైర్ డిపార్ట్‌మెంట్ వారి సహకారంతో అదుపులోకి తెచ్చారు.

తృటిలో తప్పిన ప్రమాదం

పోరుమామిళ్ల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి):మండలంలోని చెన్నారెడ్డిపేట వద్ద ఆదివారంబైకును ఆర్టీసీ బస్సు ఢీకొనింది. ఆ సమయంలో డ్రైవరు చాకచక్యంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. బైకు నడిపే వ్యక్తికి గాయలు కావడంతో అతన్ని పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.,

వివేకానంద కంటి ఆస్పత్రి ప్రారంభం


ఆస్పత్రి ప్రారంభానికి వచ్చిన దేవగుడి నారాయణరెడ్డి, డాక్టర్లు

జమ్మలమడుగు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని తాడిపత్రి రోడ్డు సంజాములమోటు మధ్య ఆదివారం ఉదయం మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణమ్మ ఆస్పత్రిని ప్రారంభించారు. ముందుగా వారు కంటి ఆస్పత్రి ప్రారంబానికి వచ్చిన డాక్టర్లు, తదితరులను ఘనంగా ఆహ్వానించారు. అత్యాధునిక కేటరాక్ట్ సర్జరీలు, నొప్పి లేకుండా, కుట్టు లేకుండా త్వరగా ఉపశమనం కలిగించే ఆస్పత్రిలో కంటి శస్త్ర చికిత్సలు డాక్టర్ కె.వినమృత చేస్తారని వారు తెలిపారు. పట్టణంలో కంటి ఆస్పత్రి ప్రారంభం వలన చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరమని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివేకానంద కళాశాల కరస్పాండెంట్ సుబ్బారెడ్డి, డాక్టర్లు ఎంఎల్ నారాయణరెడ్డి, దేవగుడి గోపాల్‌రెడ్డి, ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన ప్రతిహామీని నెరవేరుస్తా : రితేష్‌రెడ్డి


బ్రిడ్జి నిర్మాణ భూమిపూజలో పాల్గొన్న రితేష్‌రెడ్డి తదితరులు

కాశినాయన ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు పాదయాత్రలో ప్రజలకు తాను ఇచ్చిన ప్రతి హామీని తప్పక నెరవేరుస్తానని బద్వేల్ టీడీపీ సమన్వయకర్త కే.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగా ఆదివా రం ఉప్పలూరు సమీపంలోని సగిలే రుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పలూరు పంచాయతీ ప్రజలు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న సగిలేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం ఉమ్మడి ప్రభుత్వంలో కార్యరూపం దాల్చడం చాలా ఆనందంగా ఉందన్నారు. సాధ్యమైనంత తొందరగా పూర్తిచేసి ఈ ప్రభుత్వంలోనే ప్రారంభోత్సవం చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, బీజేపీ నాయకుడు బొజ్జా రోశన్న టీడీపీ నాయకులు బి.రవీంద్రారెడ్డి, పి.పోలిరెడ్డి, ఎం.పీరారెడ్డి, ఓ.రోహిత్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఎన్టీఆర్ సుధాకర్ పాల్గొన్నారు.

వద్దిరాల మాజీ సర్పంచ్ మృతి

మైలవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మైలవరం మండలంలోని వద్దిరాల టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ సింగనమల్ల చంద్రశేఖర్‌రెడ్డి (70) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వద్దిరాల పంచాయతీ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని పలువురు నాయకులు కొనియాడారు. మాజీ సర్పంచ్ మృతిచెందిన విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, ఎంపీపీ భర్త చెన్నకేశవరెడ్డి, కూటమి నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

గడ్డివామి దగ్ధం

ముద్దనూరు ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండల పరిధి ఉప్పలూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున అట్లా జగదీశ్వరరెడ్డికి చెందిన గడ్డివామిపై నిప్పు రవ్వలు పడి కాలిపోయింది. గ్రామంలో జ్యోతుల ఊరేగింపు సందర్భంగా బాణా సంచా పేలుస్తుండగా ప్రమాదవశాత్తు నిప్పు రవ్వలు గడి వామి పై పడి కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. దాదాపు రూ.50వేలు నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు.

అంకాళమ్మ తల్లి చల్లంగా చూడు


అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

ఖాజీపేట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తల్లీ... ఈ ఏడాది అయినా మమల్ని చల్లంగా చూడు అమ్మా, అంటూ మహిళలు భారీగా దుంపలగట్టు అంకాళమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. మండల పరిధిలోని కూనవారిపల్లె, సీతానగరం, నాగపట్నం, కొత్తపల్లె, ఇంకాపలు గ్రామాల్లో తెల్లవారుజాము నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యుడు రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే భక్తులకు అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కొండాపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దత్తాపురం జడ్పీహైస్కూల్‌లో 2007-08 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు 17 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఆనాడు తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. ఒకరినొకరు ఆప్యాయంగా తమ అనుభూతులను పంచుకున్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఈ కార్యాక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ తల్లి పునఃప్రతిష్ఠ వేడుకలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్

మైదుకూరు రూరల్ ,ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి) :మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె గ్రామంలో వెలసిన పోలేరమ్మ తల్లి పునః ప్రతిష్ఠ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పోలేరమ్మతల్లి ఆలయం వద్ద వేకువజాము నుంచే వేదపండితుల చేత హోమాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే శెట్టివారిపల్లె గ్రామంలో నూతనంగా వేసిన వీధిలైట్లను ప్రారం భించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మధుసూధన్‌రెడ్డి, పొలిమేర శివశంకర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, మిల్లు శ్రీను, బ్రహ్మానందరెడ్డి, పుట్టా ఎరికిలయ్య, ప్రభాకర్‌యాదవ్ తదిత రులు పాల్గొన్నారు.

కల్వటాలలో ఘనంగా గంగ జాతర


అమ్మవారికి సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న భక్తులు

పెద్దముడియం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్వటాల గ్రామంలో గంగ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలోని బస్టాండు సమీపంలో గంగమ్మ గుడి వద్ద శనివారం రాత్రి భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారికి పూజలు చేశారు. గ్రామమే కాక సమీప గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన మేళతాళాలు డప్పువాయిద్యాల మధ్య అమ్మవారికి బోనాలు పెద్దఎత్తున సమర్పించారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి అమ్మవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. రూరల్ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, పెద్దముడియం ఎస్ఐ సుబ్బారావు ఇతర పోలీసు సిబ్బంది గంగజాతర సందర్భంగా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించారు.

కాశినాయనలో మారెమ్మతల్లికి ప్రత్యేక పూజలు


మారెమ్మతల్లి

కాశినాయన ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలాయపల్లె గ్రామస్థులు ఆదివారం మారెమ్మతల్లి ఆలయంలో మండల పూజ(41రోజుల) ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి పొంగళ్ళుపెట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, బద్వేల్ నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త కె.రితేష్‌రెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, టీడీపీ నాయ కులు బి.జయరామిరెడ్డి, డి.క్రిష్టారెడ్డి, వైసీపీ నాయకులు కరెంట్ రమణారెడ్డి, ఎన్ విశ్వనాద్‌రెడ్డి తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

నందీశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సహకరిస్తాం


ఆలయ సముదాయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విరజానందస్వామి

పోరుమామిళ్ల , ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్లలోని బండినర్వ ప్రాంతంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న నందీశ్వరస్వామి దేవాలయ సమూహమునకు తన వంతు సహాయ సహకారం అందిస్తామని బద్వేలు టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బండినర్వ ప్రాంతంలో నందీశ్వరస్వామి దేవాలయ సమూహ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కార్యకమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో దేవాలయ సమూహ నిర్మాణం చేపట్టడం ఎంతో గొప్ప విషయమ న్నారు. ఫోర్‌లేన్, సిక్స్‌లేన్ ఈ ప్రాంతం గుండా వెళుతున్నాయని, ఆధ్యాత్మిక కేంద్రంగా ఈ దేవాలయ సముదాయం ప్రసిద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పాల్గొన్నారు. బద్వేలు మార్కెట్ యార్డు మాజీ వైస్ ఛైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.25లక్షలు ఆర్థికసాయం అందిస్తామన్నారు. అచలానరద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి చేతుల మీదుగా హోమం, భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకుడు బొజ్జ రోశన్న, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ సాదనకారిరంతు, రంగసముద్రం సర్పంచ్ చిత్త రవిప్రకాశ్‌రెడ్డి, దేవాలయ కమిటి సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా చౌడేశ్వరీదేవి జ్యోతి మహోత్సవం


జ్యోతులు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రూరల్ పరిధిలోని కామనూరులోని చౌడేశ్వరీదేవి ఆలయంలో జ్యోతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి ఉత్సవాలు ఆదివారం ఉదయం వరకు కొనసాగాయి. భక్తులు చౌడేశ్వరీదేవి జ్యోతిని తలపై పెట్టుకుని మంగళవాయిద్యాలకు అనుగుణంగా నృత్యం చేస్తూ అమ్మవారిని భక్తిశ్రద్ధలతో స్మరించుకున్నారు. దారి వెంబడి భక్తులు కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రామకృష్ణారెడ్డి, నాగరాజు, చలమయ్య, లక్ష్మినారాయణ, సుబ్బన్న, సుబ్బరాయుడు, రామాంజనేయులు, చౌడం రవి, తదితరులు పాల్గొన్నారు.

దేవతామూర్తుల విగ్రహాల ఊరేగింపు



ముద్దనూరు ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి):మండల పరిధి రాజులగురువాయపల్లె గ్రామంలో గౌరీశంకరస్వామి ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం దేవతామూర్తుల విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా బిందె సేవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆలయం వద్ద భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు.

భైరవస్వామి ఆలయానికి భూమిపూజ


భైరవస్వామి ఆలయానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు

కాశినాయన ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): మండలంలోరి పిట్టిగుంట గ్రామంలో భైరవస్వామి ఆలయ నిర్మాణానికి ఆదివారం గ్రామస్థులు భూమిపూజ నిర్వహించారు. అతి పురాతనమైన భైరవస్వామి దేవాలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్థులు నూతన ఆలయ నిర్మాణానికి నడుంబిగించారు. గ్రామపురోహితుడు చంద్రశేఖర్ శర్మ ఆధ్వర్యంలో ఆలయంలోని విగ్రహాలను అక్కడి నుంచి తొలగించి భద్రపరిచి నూత న ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

రామచంద్రస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే పుట్టా

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముడుమాల పంచాయతీ కేశవాపురం గ్రామంలోని రామాలయంలో రామచంద్ర స్వామిని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఇటీవల సీతారామ లక్ష్మణ హనుమత్ నూతన విగ్రహ శిఖర కలశ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గ్రామస్థులు నిర్వహించారు. 41 రోజులు పూర్తి కావడంతో గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆదివారం స్వామివారిని దర్శించుకుని అనంతరం గ్రామ ప్రజలతో మాట్లాడి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ఘనంగా శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బి.మఠం మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, కాణాల మల్లికార్జునరెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి, మాజీ సర్పంచ్ దారం బాలయ్య, ఆదిబోయిన రమణయ్య, శ్రీనివాసులరెడ్డి, పుట్టా ప్రభాకర్‌యాదవ్, సాంబశివారెడ్డి, పూజా శివ, మాజీ ఎంపీటీసీ రమేశ్, మిల్లు శ్రీను, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఏపీ రవీంద్ర, రేకలకుంట శివ, గ్రామంలోని టీడీపీ నేతలు, నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు, పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించగలరు.
ప్రొద్దుటూరు - A.C.O.: 99854 11466 జమ్మలమడుగు - S.R.: 94404 72816 మైదుకూరు - S.R.: 91334 42886 బద్వేల్ - S.R.: 99666 83437 D.C.M. : 99854 11184